ప్రకటనకే పరిమితం..!

- భీమారంలో ఆసుపత్రి లేక ప్రజల ఇబ్బందులు
- మంజూరైనట్లు ప్రకటించి దాదాపు పది నెలలు పూర్తి
- నేటికీ నిర్మాణానికి ముందుకు పడని అడుగులు
- పట్టించుకోని అధికారులు


భీమారంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం

భీమారం: మండల కేంద్రంలో పీహెచ్‌సీ మంజూరు చేసినట్లు ప్రకటించి దాదాపు 10నెలలు గడుస్తున్నా, నేటికీ ప్రారంభం కాలేదు. ప్రభుత్వ మాజీ విప్ బాల్కసుమన్ గతంలో భీమారంలో పీహెచ్‌సీ ఏర్పాటు కోసం ప్రభుత్వం మంజూరు చేసినట్లు ప్రకటించారు. దానికి అడుగులు మాత్రం పడకపోవడంతో ప్రజల్లో అనుమానం రేకెత్తిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2016లో కొత్తగా ఏర్పాటు చేసిన మండలాల్లో భీమారం ఒకటి. అయితే ప్రభుత్వం మండల కేంద్రంలో కొన్ని కార్యాలయాలనే ఏర్పాటు చేసి చేతులు దులుపేసుకుంది. అత్యవసరమైన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లేక ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మండలంలోని 11గ్రామ పంచాయతీల ప్రజలు ఆరోగ్య సమస్యలు ఏర్పడితే వైద్యం కోసం జైపూర్, చెన్నూర్‌కు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం మండల పరిధిలోని భీమారం, మద్దికల్‌లోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఏఎన్‌ఎం వద్ద నామమాత్రపు సేవలు పొందుతున్నారు. అయితే అందులో ఎలాంటి చికిత్సలు చేసే అవకాశంలేదని ప్రజలు వాపోతున్నారు.

వర్షాకాలంలో మరిన్ని కష్టాలు..

వర్షాకాలంలో జ్వరాలు సోకితే చికిత్స పొందేందుకు నానా కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లేక గ్రామాల్లోని ప్రైవేట్ ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఇదే అదునుగా తీసుకొని కొందరు ఆర్‌ఎంపీలు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలు ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పీహెచ్‌సీ ఏర్పాటుకు ముందుకు రావాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే పట్టించుకోవాలి

భీమారంలో మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి చొరవ చూపాలని ప్రజలు వేడుకుంటున్నారు. కొత్తగా ఏర్పడ్డ భీమారం మండల కేంద్రంలో అతి ముఖ్యమైన పీహెచ్‌సీ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయంలో ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

పీహెచ్‌సీ లేక కష్టాలు



మండల కేంద్రంలో పీహెచ్‌సీ లేకపోవడంతో చాలా ఇబ్బంది అవుతోంది. చికిత్స కోసం కూడా జైపూర్ వెళ్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని మండల కేంద్రంలో ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి.

\- సిరిపురం మధూకర్, భీమారం

ఎలాంటి సమాచారం లేదు

కొత్తగా ఏర్పడ్డ భీమారంలో పీహెచ్‌సీ ఏర్పాటుపై ఉన్నతాధికారుల నుంచి సమాచారం లేదు. ఉమ్మడి జైపూర్ మండలంలోని భీమారంలోని 11గ్రామాలకు జైపూర్ నుంచి సేవలు అందిస్తున్నాం.

\- అనిల్‌కుమార్, ఉమ్మడి జైపూర్ మండల వైద్యాధికారి

చదువును మించిన ఆస్తి మరొక్కటి లేదు

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

జైపూర్: చదువే ఉన్నతమైన స్థానంలో నిలుపుతుందని, చదువును మించిన ఆస్తి మరొక్కటి లేదని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ శ్రద్ధగా చదవాలని సూచించారు. స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ఆయన ఎస్సై శ్రీధర్, పాఠశాల ప్రత్యేక అధికారి ఫణిబాలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులపై ప్రత్యేక దృష్టి

- డీఆర్డీవో కిషన్


ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్డీవో కిషన్‌తో అధికారులు

భీమారం: ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో చేపడుతున్న పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని డీఆర్డీవో కిషన్ పేర్కొన్నారు. మండల పరిషత్ ఆవరణలో సోమవారం ఈజీఎస్ పనులపై నిర్వహించిన ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పెద్ద ఎత్తున కూలీలకు పనులు కల్పిస్తుందని, అయితే ఈ విషయంలో ఏటా తనిఖీ బృందాలతో తనిఖీలు నిర్వహించి తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుందన్నారు. దీని ద్వారా పనుల్లో పారదర్శకత ఉంటుందన్నారు. ఈ మేరకు 11గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనులపై బృందాలు చేసిన తనిఖీల్లో బయటపడ్డ అవకతవకలను సభలో వివరించారు. ఇందులో ఎంపీడీవో రాధారాథోడ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



లక్సెట్టిపేట: మండలంలోని ఎల్లారం గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వర్షాకాలం సమీపిస్తున్నందునా సీజనల్ వ్యాధులు ప్రభలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను పాటలతో వివరించారు. ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు రమేశ్, మురళి, పోషం, శ్రీనివాస్, కిష్టయ్య, కృష్ణ, రవీందర్, నాగలక్ష్మి, సంధ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంట్రోల్ రూం ఏర్పాటు

నస్పూర్: వర్షాకాలం దృష్ట్యా రానున్న రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ కార్యాలయంలో 24గంటలు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా శానిటేషన్, తాగునీరు, ఎలక్ట్రిక్ లైట్స్, శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, కరెంట్ డిపార్ట్‌మెంట్ సమస్యలు, ఏమైనా ఇబ్బందులు కలిగితే మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ 9618801905, కంట్రోల్ రూం ఇన్‌చార్జి టీ.శ్రీకాంత్ 9550665667, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పిట్టల ప్రభాకర్ 9949219646, అసిస్టెంట్ ఇంజనీర్ డి.మధు 99592 83814, టీపీఎస్ ఆర్.సతీష్ 8074779049, విద్యుత్‌శాఖ ఏఈ రామ్మూర్తి 9440811719 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత


నియామకపత్రాలు అందుకున్న వారితో ఏరియా జీఎం మనోహర్

మందమర్రిరూరల్: ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో సోమవారం జీఎం మనోహర్ 11మందికి కారుణ్య నియామక ఉద్యోగ పత్రాలు అందించారు. నూతనంగా ఉద్యోగాల్లో చేరేవారు విధులకు సక్రమంగా హాజరుకావాలని సూచించారు. సంస్థ నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ ఆఫీసర్ శ్యాంసుందర్, అధికారులు సత్యబోస్, రాయలింగు, షైడీశ్వర్, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుర్మపల్లి ఎక్స్‌రోడ్ వద్ద సోమవారం ఓ వృద్ధురాలు మృతిచెందగా ఆమెకు నా అనే వారు ఎవరూ లేరని తెలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్ అధికారులు అంత్యక్రియలు జరిపించారు. ఓపెన్ కాస్ట్ గని సమీపంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, పలిగిరి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నిర్మూలనకు కృషి చేయాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జిల్లా మహిళా మోర్చ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు సోమవారం వినతి పత్రం అందించారు. మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి మాట్లాడుతూ.. మంచిర్యాలలో వీధి కుక్కలు చిన్నారులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, కుక్కలు కరిచి ప్రాణాలు పోయే పరిస్థితులు రాకముందే చర్యలు తీసుకోవాలని కోరారు.

కబ్జా నుంచి కాపాడండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కొత్తపల్లి, దస్నాపూర్ గ్రామస్తులు

వేమనపల్లి: అక్రమార్కుల చెరలో ఉన్న దస్నాపూర్ శివారులోని వేమనపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల, పెద్ద చెరువు శిఖం భూమిని రక్షించాలని దస్నాపూర్, కొత్తపల్లి గ్రామస్తులు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత ప్రజావాణిలో కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశామన్నారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నారు. పెద్ద చెరువు విస్తీర్ణం 30ఎకరాల 18గుంటలు ఉండగా దస్నాపూర్, మంగెనపల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని పంటలు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలను సైతం మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ రెండు ఎకరాలు ఆక్రమించుకొని పొలం సాగు చేస్తున్నాడన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కబ్జాలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకొని రైతులకు, ఆశ్రమ పాఠశాల విద్యార్థుల అవసరాలకు ఉపయోగించాలని కోరారు.

'ప్రజావాణి' సద్వినియోగం చేసుకోవాలి


భీమారం: ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

నెన్నెల/భీమారం/లక్సెట్టిపేట/కాసిపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భీమారంలో ఆరెపల్లి గ్రామానికి చెందిన రైతులు ఎర్ర చెరువు నుంచి పొలాలకు నీరందడం లేదని, కాలువలు నిర్మించాలని దరఖాస్తు అందజేశారు. లక్సెట్టిపేటలో ఎనిమిది దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రాఘవేంద్రరావు పేర్కొన్నారు. కాసిపేటలో ఆదివాసీ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి, పోస్టులు కేటాయించాలని దరఖాస్తు అందించారు. పాతతిరుమలాపూర్ ఐటీడీఏస్ స్కూల్‌లో వెంటనే భవనం నిర్మించాలని, గట్రావ్‌పల్లిలో అసంపూర్తిగా ఉన్న సబ్‌సెంటర్‌ను వెంటనే ప్రారంభించాలని, కాసిపేట మండలంలోని కేటాయించిన గురుకుల పాఠశాలను బెల్లంపల్లిలో కాకుండా కాసిపేటలో కొనసాగించాలని, రైతు రుణమాఫీపై ఆదివాసీ గ్రామాల్లో సర్వే చేసి అర్హులైన ఆదివాసీ రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నెన్నెలలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఆయా కార్యక్రమాల్లో నెన్నెలలో ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో నరేశ్, ఎంపీఎం విజయలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్, భీమారంలో ఎంపీవో బాపురావు, లక్సెట్టిపేటలో ఎంపీడీవో సరోజ, ఏవో ప్రభాకర్‌రెడ్డి, ఏపీవో వెంకటరమణ, ఏపీఎం లక్ష్మి, కాసిపేటలో ఆదివాసీ సేన మండల కమిటీ నాయకులు వెంకటేష్, పెంద్రం శంకర్, సిడాం శంకర్, సిడాం గణపతి, ధర్మరావు, మడావి ధర్మరావు, సిడాం రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి


మంచిర్యాల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ...

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సభలో బీసీలకు ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయడంలో కాలయాపన చేయడంపై బీజేపీ ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో తహసీల్దార్ రమేశ్‌కు, హాజీపూర్‌లో తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో బీసీ మోర్చ పట్టణ అధ్యక్షుడు మామిడి రాజుకుమార్, అమిరిశెట్టి రాజు, పి. రాజేశ్, ఎం.సూరి, పి.నారాయణ, బి.సత్యనారాయణ, హాజీపూర్‌లో సత్తయ్య, బొలిశెట్టి తిరుపతి, కృష్ణమూర్తి, సత్యం, ప్రశాంత్, శేఖర్, పి.హిమశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ప్రాంగణానికి మరమ్మతులు



మంచిర్యాలఅగ్రికల్చర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లా సమీకృత కలెక్టరేట్ ముఖద్వారం వద్ద వర్షపు నీరు కారుతుండడంతో సోమవారం సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. స్లాబ్‌కు ప్లాస్టిక్ పైపులు అమర్చి, నీరు రాకుండా ఏర్పాటు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఆశాకార్యకర్తలు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సంక్షిప్త వార్తలు

బీఎస్పీలో చేరిక

మందమర్రిరూరల్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన ముల్కల్ల రాజేంద్రప్రసాద్ బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)లో చేరినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్, జిల్లా అధ్యక్షుడు కట్టా కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రప్రసాద్‌ను చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

నస్పూర్/కాసిపేట: నస్పూర్ పట్టణ పరిధి సింగాపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఎంఈవో బండారి సత్యనారాయణ సోమవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. కాసిపేట మండల కేంద్రంలోని ముత్యంపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో మానస సేవాసమితి ద్వారా విద్యార్థులకు బ్యాగులు అందజేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, న్యాయవాది రెడ్డిమల్ల ప్రకాశం ఇటీవల మ్యూజిక్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఎంబీర్ అందజేసిన డాక్టరేట్ పట్టా అందుకున్న సందర్భంగా మండలంలోని రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో సన్మానం చేశారు.

కేజీబీవీలో సభ్యత్వ నమోదు

కాసిపేట: స్థానిక కేజీబీవీలో సోమవారం భోజన విరామ సమయంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు శాంకారి, మండల అధ్యక్షుడు రమణరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

'ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ ఎత్తివేయండి'

కాసిపేట: దండేపల్లి మండలం తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దళిత మహిళా కాబట్టే అనేక ఆరోపణల పేరుతో సస్పెండ్ చేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని, సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్‌మాదిగ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సమాచారం

సైబర్ క్రైమ్ సీఐ బదిలీ

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా సైబర్ క్రైమ్-1 సీఐగా పనిచేస్తున్న ముత్తి లింగయ్యను ఖమ్మం కమిషనరేట్‌లోని సత్తుపల్లి రూరల్ సీఐగా బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో హవర్లీ బేసిక్ పద్ధతిలో బోధించుటకు గణిత అధ్యాపకుడు కావాలని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి పీజీ గణితంలో 50శాతం మార్కులతో బీఈడీ చేసిన వారై ఉండాలని, ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని అనుభవం గలవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. గరిష్ఠంగా వేతనం రూ.18వేలు ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

రైతుబీమాకు...

కాసిపేట: అర్హులైన రైతులు ఆగస్టు 5వ తేదీలోపు వారి వివరాలతో రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి వందన తెలిపారు. ముత్యంపల్లి రైతువేదికలో సోమవారం అవగాహన కల్పించారు.

నియామకం

కాసిపేట: మత్స్యగంధి మల్టీ స్టేట్ ఫిషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటీ జిల్లా ప్రధానకార్యదర్శిగా కాసిపేట మండలానికి చెందిన సూరం సంపత్ కుమార్ నియమితులయ్యారు.

మధ్యాహ్న భోజన కార్మికుల కార్యవర్గం

పాతమంచిర్యాల: మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని చార్వక ట్రస్ట్ భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా దాసరి రాజేశ్వరి, కార్యదర్శిగా రఫీయా, ఉపాధ్యక్షులుగా రాణి, సరిత, వరలక్ష్మి, కోశాధికారి సునీత, సహాయ కార్యదర్శులుగా గడ్డం లక్ష్మి, రబీయా, సెపూరి లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులుగా మధునమ్మ, కళావతి, లక్ష్మి, తిరుమల, జ్యోతి, సుశీలను ఎన్నుకున్నారు.

దండేపల్లి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌గా నాగవర్మ

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ముత్యం నాగవర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ప్రిన్సి పాల్ అనీలా సస్పెన్షన్ కావడంతో ఆమె స్థానంలో పాఠశాలలో పనిచేస్తున్న నాగవర్మకు ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ, మోడల్‌స్కూల్ అడిషనల్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నాగవర్మ విధుల్లో చేరాడు.

బాధ్యతలు స్వీకరణ

కాసిపేట: మండల పంచాయతీ అధికారిగా సోమవారం షేక్ సబ్దర్ అలీ బాధ్యతలు స్వీకరించారు.

దండేపల్లి: మండల పంచాయతీ ఆఫీసర్ (ఎంపీవో)గా కె.విజయ్‌ప్రసాద్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

జైపూర్: మండల పంచాయతీ అధికారిగా శ్రీపతి బాపురావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

జాతీయ పతాక ఆమోద దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పాతమంచిర్యాల: భారత జాతీయ పతాక ఆమోద దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జెడ్పీ బాలుర పాఠశాల వరకు 77మీటర్ల మువ్వన్నెల జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ వెంకటేశ్వర్‌రావు, లయన్స్ క్లబ్ వివిధ క్లబ్‌ల సభ్యులు, కోశాధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జన్నారం: ఏళ్లుగా సాగు చేసుకుంటున్న అటవీ భూ ములకు పట్టాలివ్వాలని గ్రామీణ పేదల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో చేపట్టే పోరాటానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు.

పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలి

జైపూర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలని, వానల కాలాన్ని దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీతో పాటు సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర హాస్టల్‌ను సోమవారం పరిశీలించారు.

హౌజింగ్ సొసైటీ సమస్యలపై కలెక్టర్‌కు వినతి


సమస్యలు వివరిస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: టీఎన్జీవోస్ హౌజింగ్ సొసైటీ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం టీఎన్జీవోస్ సభ్యులు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి హబీబ్‌లు మాట్లాడుతూ.. హౌజింగ్ సొసైటీ సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమస్యల పరిష్కరించనున్నట్లు కలెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి, మన్నెగూడం, కోణంపేట, నెన్నెల శివారు గ్రామాల్లో సోమవారం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఏఓ శ్రీకాంత్, ఏఈఓ రాంచందర్ పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంట పొలాల్లో వర్షం నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కాసిపేట: మండలంలోని మామిడిగూడెం, కోమటిచేను, చింతగూడ గ్రామాల్లో సోమవారం పత్తిపంటను మండల వ్యవసాయాధికారిణి వందన పరిశీలించారు.

'ముంపు బాధితులకు అండగా ఉంటాం'

వేమనపల్లి: ప్రాణహిత వరదతో పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్ అన్నారు. తహసీల్దార్ రమేశ్‌తో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. వరద తగ్గుముఖం పట్టిన వెంటనే పంట నష్టం అంచనాలు సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

'చేపల'వేట



మంచిర్యాలటౌన్: జిల్లాలోని రాళ్లవాగు కాజ్‌వే వద్ద స్థానికులు సోమవారం చేపలు పడుతూ సందడి చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మంచిర్యాలక్రైం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, బెల్లంపెల్లి చౌరస్తాలోని ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

సౌకర్యాలు కల్పించాలి

చెన్నూర్: పట్టణంలోని ఎస్సీ బాలుర, గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కుల వివక్ష పోరాట సంఘం జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ అన్నారు. కేవీపీఎస్ వసతి గృహాల అధ్యయన యాత్రలో భాగంగా సోమవారం సందర్శించారు.